క్లుప్తంగా

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని లిఖితకు ఆర్థిక సాయం అందిస్తున్న డీఈఓ రవిసాగర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పేదలను ఆదుకోవడానికి కొందరు ఉపాధ్యాయులు కలిసి స్థాపించిన శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్ సంస్థ నిర్వహిస్తోన్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవిసాగర్ ప్రశంసించారు. పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మెట్లపల్లి ప్రసాద్ కుమార్తె లిఖిత ఇంటర్మీడియట్ సీఈసీ గ్రూప్‌లో 857 మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలయింది. ఆమె ఉన్నత విద్యాభ్యాసానికి శ్రీసాయి హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు శనివారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో రవిసాగర్ చేతుల మీదుగా లిఖితకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బి.ధర్మరావు, వి.విశ్వేశ్వరరావు, డీకేఎస్ఎస్ ప్రకాష్, ఇ.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, జి.మోహన్, ఏపీటీఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల బలోపేతానికి కృషి



రాజాను సత్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్యవైశ్యులను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అంబికా రాజా పేర్కొన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమితులైన అంబికా రాజాకు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు శనివారం ఏలూరులోని ఆయన నివాసంలో కలిసి నియామక పత్రం అందజేశారు. ఆర్యవైశ్యులను ఐకమత్యం చేసేందుకే ఆర్యవైశ్య మహాసభ ఏర్పాటు చేసినట్టు శ్రీనివాసరావు చెప్పారు. వివిధ దేశాల్లో స్థిరపడిన ఆర్యవైశ్యులను ఏకతాటిపైకి తీసుకురావడానికి కృషి చేస్తామని, సేవా కార్యక్రమాలను విస్తరిస్తామని రాజా తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్, ఆర్యవైశ్య నాయకులు గుడివాడ రామచంద్ర కిషోర్, నున్నా శ్రీను, గూడవల్లి వాసు, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం దక్షిణ భారత అధ్యక్షురాలు కొరిపల్లి జయశ్రీ రాఘవ, కె.రాఘవ రావు తదితరులు రాజాను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పేదల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

- ప్రజలతో ఎమ్మెల్యే నాని మమేకం
- 103వ రోజు 47వ డివిజన్‌లో పాదయాత్ర



47వ డివిజన్‌లో మహిళకు పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్ : రాష్ట్రంలో పేదల జీవితాలకు భరోసా.. వారి కుటుంబాల్లో ఆనందం వెల్లువిరియాలనే ఉన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. 103వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏలూరు 47వ డివిజన్ ఇశ్రామేలుపేట కమ్యూనిటీ హాలు వద్ద శనివారం నిర్వహించారు. నాని పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా తల్లీ.. వృద్ధులకు సకాలంలో పెన్షన్లు ఇస్తున్నారా ? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి ప్రభుత్వం లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి పడుతున్న తపన చూస్తుంటే మరో 30 ఏళ్ల ఆయనే పాలిస్తాడనే ధీమా వస్తుందని చెప్పారు. రాజకీయాలకు, కుల, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రజల బతుకుల్లో మార్పులు తీసుకురావాలనే కాంక్షతో శ్రమిస్తోన్న విధానం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచేలా చేస్తోందని వివరించారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో ఏ నాయకుడు ఆలోచించని రీతిలో నిత్యం సరికొత్త విధానాలు, పథకాలతో ప్రజల మనస్సులు గెలుచుకునేందుకే సీఎం జగన్ పరితపిస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఏం చేయాలో తెలిసిన ఏకైక నాయకుడు సీఎం జగనన్న అన్నారు. ఏదైనా సాంకేతిక లోపంతో ప్రభుత్వ పథకాలకు దూరమైతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి పథకాలను అందించేందుకు వినూత్న కార్యక్రమం జగనన్న సురక్ష అమలు చేస్తున్నారని వివరించారు. ఎవరూ అధైర్యపడవద్దని ప్రతి అర్హునికీ పథకాలు అందుతాయని భరోసా కల్పించారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తొలుత నగర కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానిని సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయ నిర్మల, ఇనపనూరి కేదారేశ్వరి, పొలిమేర దాసు, దేవరకొండ శ్రీనివాస్, కలవకొల్లు సాంబ, సుంకర చంద్రశేఖర్, పిల్లంగోళ్ల శ్రీదేవి, నాయకులు పొలిమేర హరికృష్ణ, లూటుకుర్తి సుభాస్, లక్కోజు గోపి, నగర కమిషనర్ వెంకటకృష్ణ, ఎంహెచ్‌ఓ మాలతి, పీఓ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి వనితకు శుభాకాంక్షలు





హోంమంత్రి వనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న హరికృష్ణ, రవిప్రకాష్ తదితరులు

ఏలూరు (టూటౌన్): హోంమంత్రి తానేటి వనిత పుట్టిన రోజును పురస్కరించుకుని ఏలూరుకు చెందిన పలువురు నాయకులు కొవ్వూరులో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాల పెంపు సాధనసమితి జాతీయ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పొలిమేర హరికృష్ణ ఈ సందర్భంగా మంత్రి వనితను గజమాల, కిరీటం, శాలువాతో సత్కరించారు. సీఎం వైఎస్ జగన్ ఆశయ సాధనలో తన వంతు పాత్ర పోషిస్తూ ప్రజల్లో తనకుంటూ గుర్తింపును, ఒక ప్రత్యేకత తెచ్చుకున్నారంటూ హరికృష్ణ ప్రశంసించారు. దళితసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మంత్రి వనితను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చీలి మోహనరావు, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కపాము చంటి, జిల్లా కార్యదర్శి పింగుల ఇదియా, చింతాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణకు సెట్‌వెల్ తోడ్పాటు



శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సెట్‌వెల్ సీఈఓ మెహర్‌రాజు

ఏలూరు (టూటౌన్): ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే కంప్యూటర్ శిక్షణా కార్యక్రమాలకు సెట్‌వెల్ విభాగం తోడ్పాటు అందిస్తుందని సెట్‌వెల్ సీఈఓ మెహర్‌రాజు తెలిపారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 23వ బ్యాచ్ వారికి శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మెహర్‌రాజు చేతులు మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఈఓ మెహర్‌రాజు మాట్లాడుతూ కంప్యూటర్ విద్య ప్రతి ఉద్యోగానికీ అవసరమన్నారు. విద్యార్థి దశలోనే కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవడం ఉత్తమమని చెప్పారు. 2019లో ప్రారంభించిన ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కేంద్రంగా రెగ్యులర్‌గా ఉపాధికి ఉపయోగపడే ఎమ్మెస్ ఆఫీస్, డీటీపీ, ఫొటోషాప్, ట్యాలీ కోర్సులు ఉచితంగా నేర్పడం అభినందనీయమన్నారు. సెట్‌వెల్ తరుపున కంప్యూటర్ శిక్షణా కేంద్రానికి రాబోయే బ్యాచ్ నుంచి గుర్తింపు ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ తమ శిక్షణా కేంద్రానికి సెట్‌వెల్ గుర్తింపు ఇవ్వడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల యువతీ యువకులు, నిరుద్యోగులు కంప్యూటర్ శిక్షణను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు జి.శారద, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాల ఆందోళన

దెందులూరు: దెందులూరు పంచాయతీ పరిధిలో విధుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్య ధోరణిపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల్లో ఇప్పటి వరకు దెందులూరు పంచాయతీ పరిధిలో దాదాపు 20 మంది మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులు డెత్ సర్టిఫికెట్ కోసం నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. పంచాయతీలోని ఉద్యోగులు కొంత మందిని దరఖాస్తు తీసుకోలేమని వెనక్కి పంపుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని దరఖాస్తులు తీసుకున్నప్పటికీ మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు కావడం లేదని, దీంతో పెన్షన్లు, ఉద్యోగం, బ్యాంకు, విక్రయం, ఆస్తులు, ఇతర లావాదేవీల పనులు నిలిచిపోయాయని, కుటుంబ పెద్ద చనిపోయి పుట్టెడు దుఃఖంలో కుటుంబ సభ్యులు బాధపడుతుంటే ఉద్యోగులు సైతం మరణ ధ్రువీకరణపత్రాలు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమంటున్నారు. దీనిపై మండలాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని మరణ ధ్రువీకరణపత్రం మంజూరులో ఆటంకాలు వెంటనే తొలగించాలని కోరారు.

సోమబ్రహ్మం మృతికి సంతాపం

దెందులూరు: పెరుగ్గూడెం గ్రామానికి చెందిన యలమర్తి సోమబ్రహ్మం (85) మృతి చెందడంతో అంత్యక్రియలకు ఆయన అల్లుడు మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, మాజీ సర్పంచ్ యలమర్తి హేమ శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాది యలమర్తి విజయలక్ష్మి శనివారం హాజరై నివాళులర్పించారు. పెరుగ్గూడెంలో సోమబ్రహ్మం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సోమబ్రహ్మం అనారోగ్యంతో శుక్రవారం పెరుగ్గూడెం స్వగృహంలో మృతి చెందారు.

రేషన్ డీలర్ల మహాసభపై ప్రచారం

దెందులూరు: రేషన్ డీలర్ల రాష్ట్రస్థాయి మహాసభలు రాష్ట్రంలోని రేషన్‌డీలర్లు అందరూ హాజరై విజయవంతం చేయాలని రేషన్ డీలర్ల అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ కోరారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారులు నర్సింహమూర్తి, కమిటీ నాయకులతో కలిసి రాష్ట్ర మహాసభ విజయవంతం అయ్యేందుకు విస్తృత ప్రచారం, అతిథులను ఆహ్వానించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 23న విజయవాడలో మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో డీలర్ల మహాసభ జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా పౌరసరఫరాల శాఖ రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావును ఆహ్వానించామన్నారు. 9 అంశాలతో కూడిన సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని డీలర్లు వారి కుటుంబ సభ్యుల భద్రత, భవిష్యత్తు లక్ష్యంగా ఈ మహాసభ నిర్వహిస్తున్నామన్నారు.

కొవ్వలిలో హౌసింగ్ డే

దెందులూరు: కొవ్వలి జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్‌డే నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఎస్ఎన్ కృపావరం ఆధ్వర్యంలో జగనన్న కాలనీలో రెవెన్యూ, గృహనిర్మాణం, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయంలో రికార్డులు నమోదు చేసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ సొంతిల్లు కల్పించాలనే లక్ష్యంతో సేవలందిస్తున్నారని ఈ అవకాశాన్ని అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారి కోరారు.

ఆలయాలకు రూ.5 వేల నిర్ణయం హర్షణీయం

ఏలూరు (టూటౌన్): విశ్వబ్రాహ్మణుల ఆరాధ్యుడు బ్రహ్మంగారి ఆలయాలకు దూప, దీప నైవేద్యం నిమిత్తం ప్రభుత్వం రూ.5 వేలు ఇవ్వాలని నిర్ణయించడంపై విశ్వబ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక వన్ టౌన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంతాచారి, డైరెక్టర్ల విజ్ఞప్తి మేరకు సీఎం వైఎస్ జగన్ ఆలయాలు మాదిరిగానే బ్రహ్మంగారి గుడులకూ దూప, దీప నైవేద్యాల నిమిత్తం రూ.5 వేలు ఇవ్వాలని నిర్ణయించారని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంతాచారి, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, బీసీ మంత్రి చెల్లు బోయిన వేణుగోపాలకృష్ణ, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీ మోహన్ కృష్ణలకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పట్నాల శేషగిరిరావు, సురవరపు వెంకటాచార్యులు, జీహెచ్‌డీ ప్రసాద్, మందరపు శ్యామసుందర్, అప్పలబత్తుల శివశ్రీ, జాలిపూడి ప్రసాద్, కొత్తల శివ, పలువురు విశ్వబ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.

26, 27 తేదీల్లో గడపగడపకు మన ప్రభుత్వం

ఏలూరు రూరల్ : ఏలూరు మండలం పైడిచింతపాడులో ఈ నెల 26, 27వ తేదీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని ప్రజలకు పథకాలు వివరిస్తారని, వారి సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు.

డీఈఎల్ఈడీ పరీక్షలకు 54 మంది గైర్హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఈఎల్ఈడీ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 69 మందికి 15 మంది హాజరు కాగా 54 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ ఎన్‌వీ రవిసాగర్ పేర్కొన్నారు.

టెకు బ్యాంక్ నికర లాభం రూ.95.75 లక్షలు



సభలో మాట్లాడుతున్న అంబికా ప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ది ఏలూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ (టెకు బ్యాంకు) 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.95,75,990.77 నికర లాభాలు సాధించిందని ఆ బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్ తెలిపారు. శనివారం ఉదయం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో బ్యాంక్ మహాజన సభ నిర్వహించారు. తమ బ్యాంక్ రూ.113.48 కోట్ల వ్యాపారం నుంచి రూ.121.49 కోట్లకు చేరిందని, వివిధ వర్గాల అభ్యున్నతికి రూ.88.50 కోట్ల రుణాలు అందించిందని చెప్పారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో తమ బ్యాంక్ వ్యాపార లక్ష్యం రూ.250 కోట్లని తెలిపారు. అనకాపల్లి, విశాఖపట్నం, గుంటూరుల్లో తమ శాఖల ఏర్పాటుకు తీర్మానించామన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సభ్యులకు 10 శాతం డివిడెండ్ ప్రకటించారు. తొలుత 2022–23 ఆర్థిక సంవత్సర పరిపాలనా నివేదికను అంబికా ప్రసాద్ ప్రవేశపెట్టారు. బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.అచ్యుతరావు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

మోషేన్ రాజు పరామర్శ

ద్వారకాతిరుమల : మండలంలోని రామసింగవరం పంచాయతీ కొత్తగూడెంకు చెందిన వ్యాపారవేత్త పెన్మెత్స నరసింహరాజు తల్లి వరలక్ష్మి ఈనెల 22న రాత్రి మృతి చెందారు. దీంతో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు శనివారం కొత్తగూడెంలోని ఆమె ఇంటికి వెళ్లి, ఆమె కుమారులు చక్రవర్తిరాజు, కొండరాజు, వెంకటపతిరాజు, నరసింహరాజు, రామకృష్ణరాజులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల అమలు

- రానున్న రోజుల్లో టీడీపీని మూసేసే పరిస్థితి ఉంది
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



ఏపూరులో ప్రథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

పెదపాడు: మన రాష్ట్రంలో కుల, మత, వర్గ, పార్టీ బేధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పెదపాడు మండలంలోని ఏపూరులో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావుతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి 8వరోజు ఏపూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామన్నారు. గడపగడపకు వెళ్లినప్పుడు చక్కటి చిరునవ్వుతో ప్రజలు ఆహ్వానం పలుకుతున్నారని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజలను ధైర్యంగా ఓటు అడగగల సత్తా వైఎస్సార్ సీపీకే ఉందని ఆయన స్పష్టం చేసారు. ఇప్పటి వరకు 130 మంది గ్రామస్తులు తమ సమస్యలు విన్నవించారని వారందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అందరికీ మేలు చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తూ ఉంటే ప్రతిపక్ష పార్టీ లేనిపోని విమర్శలు చేస్తోందన్నారు. ఎలాంటి మ్యానిఫెస్టో లేకుండా ప్రతిపక్ష నేతలు బస్సుయాత్రలు, పాదయాత్రలు చేస్తున్నారని అన్నారు. ఏపూరులో ప్రజలకు అబద్ధాలు వల్లెవేయడంతో సభలో వాయు దేముడు తథాస్తు అనడంతోనే స్టేజి కూలిపోయిందన్నారు. చింతమనేనికి ఓటమి ఖాయమని వారి పార్టీ సర్వే రిపోర్టు పేర్కొనడంతో పవన్ కల్యాణ్‌కు దెందులూరు టికెట్ ఇవ్వమని చెబుతున్నాడన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. జగనన్న సురక్ష పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలుకు కావాల్సిన సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఈ గ్రామంలో 10 ఎకరాలు కొని ఇళ్ల స్థలాలుగా అందించామని, అవసరమైతే మరో 5 ఎకరాలు కొని ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాదరదావు, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, గోగుంట సొసైటీ అధ్యక్షుడు భావరాజు సత్యన్నారాయణ, ఏలూరు మండల పార్టీ అధ్యక్షుడు తేరా ఆనంద్, దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, ఏపూరు సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, ఎంపీటీసీలు నాగమల్లేశ్వరావు, శిరీషా, బెజవాడ సత్యనారాయణ, శేఖర్, నర్సింహరావు, సీనియర్ నాయకులు సంబంగి శ్రావణ్‌కుమార్, ఏఎంసీ డైరక్టరు కంభంపాటి సుబ్రహ్మణ్యేశ్వరావు, కడిమిగోవిందరావు, ఇల్లూరి విజయ్, కొండేలాజరు, కొత్తూరు విమలారావు, ముంగర రమేష్, తినాతి విజయ్, తహసీల్దార్ జీ విజయ్‌కుమార్ రాజు ఎంపీడీఓ నిర్మలజ్యోతి, వ్యవసాయ అధికారి ప్రదీప్ కుమార్, ఏపీఎం సుమలత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

పెదపాడు: ఏపూరులో ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురిని ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి శనివారం రాత్రి పరామర్శించారు. మాజీ ఎంపీటీసీ బెజవాడ సత్యనారాయణ తల్లి ద్రౌపతిని పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల భార్యను కోల్పోయిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు వెంకటేశ్వరావు (బుడ్డబాబు)ను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, జెడ్పీ చైర్ పర్సన్ ఘంట పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, స్థానిక నాయకులు బెజవాడ సత్యన్నారాయణ, సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, బెజవాడ శిరీషా, బెజవాడ శేఖర్, బెజవాడ నర్సింహరావు, నాగమల్లేశ్వరావు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం.. సార్వా పనులు ప్రారంభం

పెదవేగి : నియోజకవర్గంలోని డెల్టా, మెట్ట ప్రాంతాల్లోని రైతులు సార్వా సాగుకు సమాయత్తమవుతున్నారు. తొలకరి వర్షాలు ప్రారంభం కావడంతో దుక్కులు దున్నుతున్నారు. దెందులూరు నియోజకవర్గంలో 42,500 వేల ఎకరాల్లో సార్వా సాగవుతోంది. ఇందులో సగం పైగా నేరుగా విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తారు.

మెడపై విత్తు కత్తి

దెందులూరు నియోజకవర్గంలో 1061, 1001, పీఎల్, 1121, బీపీటీ5204, 1064 స్వర్ణ వంటి రకాలు ఎక్కువగా సాగు చేస్తారు. గతేడాది సాగునీరందక సార్వా సాగు సాఫీగా జరగలేదు. దీంతో రైతులు సొంతంగా విత్తన సేకరణ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గానికి 1,275 టన్నులకు పైగా విత్తనాలు కావాలి. వీటిలో కేవలం 50 శాతం వ్యవసాయశాఖ పంపిణీ చేసే అవకాశం ఉంది. మిగిలిన విత్తనాలు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి ఉంది. ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి ధాన్యం దళారులు విత్తనాలు కొనుగోలు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.

సాగునీటి సరఫరాకు ఏర్పాట్లు

తొలకరిలో ఆశాజనకంగా ఉన్నప్పటికీ నాట్లు వేసే సమయానికి వీటి ప్రభావం ఏ మేరకు ఉంటుందో తెలియని పరిస్థితి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయానికి పెద్ద పీటవేస్తోంది. పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో కృష్ణా కాలువ, గోదావరి కాలువలపై ఈ ఆయకట్టు ప్రాంతంపై ఆధారపడి ఉండగా, కొంత మేర బోర్లపై ఆధారపడి ఉంది. ఇదిలా ఉంటే మెట్ట ప్రాంతమైన పెదవేగి మండలం దాదాపు బోర్లపైనే ఆధారపడి సాగు జరుగుతుంది. వర్షాలు కురిసి జలాశయాలు నిండితేనే డెల్టాకు సాగునీరందే అవకాశం ఉంది. దెందులూరు నియోజకవర్గంలో నీరు లేక రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఇకపై ఉండదని స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చెబుతున్నారు.

రైతు అండగా భరోసా

వరిసాగు ఉత్పాదక వ్యయం ఏటా గణనీయంగా పెరుగుతోంది. నారుమళ్ల నుంచి కోతలు కోసే వరకు ఎకరానికి రూ.35 వేల వ్యయమవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన వైఎస్సార్ రైతు భరోసా నాలుగేళ్లుగా ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

దేవస్థానం కల్యాణ మండపంలోనే లాండ్రీ పనులు

ద్వారకాతిరుమల : శ్రీవారి కొండపైన మాధవ కల్యాణ మండప సముదాయంలోని పద్మాలయా కల్యాణ మండపం లాండ్రీ షాపుగా మారింది. దేవస్థానం విద్యుత్‌ను వినియోగిస్తూ సత్రాల్లోని బెడ్ షీట్లను కల్యాణ మండపంలో ఇస్త్రీ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఈ బెడ్ షీట్లను సంబంధిత పారిశుధ్య కాంట్రాక్టరు ఉతికించి, ఇస్త్రీ చేయించి దేవస్థానానికి అప్పగించాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా కొందరు అధికారుల అండదండలతో సంబంధిత కాంట్రాక్టరు ఏకంగా కల్యాణ మండపంలోనే ఇస్త్రీ చేయిస్తున్నారు. ఈ వ్యవహారం తనిఖీల్లో భాగంగా శనివారం ఉదయం పద్మాలయ కల్యాణ మండపంలోకి వెళ్లిన అకామిడేషన్ సూపరింటెండెంట్ రమణరాజు కంట పడింది. దాంతో ఇస్త్రీ పనులను నిలుపుదల చేయించి, సంబధిత విభాగ అధికారులకు సమాచారం అందించారు.

ఘనంగా అగ్ని ప్రతిష్ఠాపన

శ్రీవారి క్షేత్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విశ్వశాంతి, గోసంరక్షణార్థం నిర్వహిస్తున్న లక్ష పిడకల యజ్ఞంలో భాగంగా శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు.